# పల్లకీ

వర్షం !

నాలుగు రోజుల్నుండి విరామ రహితంగా ఏకధాటిగా కసిగా కురుస్తోన్న వర్షం !

వర్షమా అది ? కాదు కాదు గాలివాన. పెనుతుఫాను. ప్రకృతి భీకర ఘర్జన. భైరవ తాండవం !

చెట్లని పూతా పిండెల్లేవు. పెద్ద కొమ్మల్లేవు. పొడుగాటి చెట్లసలు నిలబడే లేవు !

వియత్నాంపై అమెరికా కురిపించిన బాంబుల్లా అంతటినీ భీభత్సం చేసేస్తూ వర్షం ! వర్షం !!

* * *

నా కెవ్వరి తోడూ సాయమూ అక్కర్లేదంటూ రొమ్ము విరుచుకుని మహారాజ ఠీవితో ధనగర్వంతో కాస్త ఎత్తైన ప్రదేశంలో నిలబడివుంది ప్రెశిడెంట్ వియ్యన్నగారి మేడ.

ఆ చుట్టు ప్రక్కలున్న ఇళ్ళని గడగడ లాడిస్తోన్న వర్షం ఆ మేడనేం చెయ్యలేక నిస్సహాయంగా చూస్తూ భోరున విలపిస్తోంది !

ఆ మేడ లోపలి హాల్లోని సోఫాల్లో వియ్యన్నగారూ ఆయన భార్యా పిల్లలూ అంతా స్వెట్టర్లు తొడుక్కుని రేడియోలో పాటలు వింటున్నారు.

బహుశా ఇనప్పెట్టెలా వుండటం వల్ల కాబోలు లోపల వెచ్చగానే వుంది.

వియ్యన్నగారు చేతులు చంకల్లో దాచుకుని కాళ్లాడిస్తూ కూర్చు న్నారు. ఒంటికి స్వెట్టరూ తలకి మఫ్లరూ వున్నాయ్. ఆయనది కాస్త భారీ శరీరం. నల్లగా తాటి తొక్క రంగులో వుంటారు. వయస్సు నలభై అయిదు దాటుతోన్నా దృఢంగానే వున్నారు. ఆ దృఢత్వం చాలా వరకూ ధన బలంతో స్థాన బలంతో వచ్చిందే. హాయిగా నిశ్చింతగా కూర్చున్న ఆయన్ని చూస్తే, బయట కుంభవృష్టిగా వర్షం కురువటం లేదనీ "ఆల్ ఈజ్ వెల్ విత్ ద వరల్డ్" అనీ అన్పిస్తుందెవరికైనా.

ఆయన భార్య గాయత్రీదేవిది బంగారు ఛాయ. మెడలోని ఆభరణాల కన్నా ఎక్కువగా మొఖం మెరుస్తూంటుంది గర్వంతో. ఆమె ముక్కు గరుత్మంతుడి ముక్కులా వుంటుంది. అది అదృష్ట సూచక మంటారు చాలామంది. అదేమో గాని కోపం వచ్చినప్పుడు మాత్రం ఆమె ముక్కూ ముక్కుపుటాలూ కూడా గొప్పగా కంపించి పోతాయ్. చిన్న కళ్లు పెద్దవై నిప్పుల్ని కురిపిస్తాయ్. సాధారణంగా ఆమె కోప్పడిందీ అంటే అది పనివాళ్ళ మీదా రైతుల మీదా అయ్యుంటుంది. ఆమె దొర సాన్లా సాగదీస్తూ మాట్లాడుతుంది. అలా మాట్లాడితే తన మాటలు చిలక పలుకుల్లా వుంటాయనుకుంటుందామె. కాదని చెప్పగల ధైర్యం ఎవరికీ లేదు !

వాళ్ళకో ముగ్గురు చిరంజీవులు. అంటే వాళ్లు ఎర్ర త్రికోణం గుర్తుంచుకున్నారని కాదు. అసలు వాళ్ళకి పుట్టిందే ముగ్గురు. ఇంకా పుట్టే ట్టయితే వాళ్ళకేం అభ్యంతరం లేదు కూడా.

పెద్దవాడు లక్ష్మీ వెంకట గాంధీ ప్రసాద్. పదేళ్ళుంటాయి వాడికి.

హాలులో ఓ ప్రక్కనున్న కుర్చీలో కూర్చుని చెడిపోయిన బ్యాటరీలైట్‌తో కుస్తీ పడుతున్నాడు.

వాడ్ని చూసి "మన పెదబాబు తప్పకుండా పెద్ద ఇంజనీరవు తాడండీ" అని గాయత్రీదేవి అంటే అవునన్నట్టుగా తలూపి వాడ్నే చూస్తూండిపోయారాయన కొంచెంసేపు.

రెండోది ఇందిరా ప్రియదర్శిని. రబ్బరు బొమ్మలా వుంటుంది. కిటికీ అద్దాల మీంచి పాముల్లా జారుతోన్న వర్షపుధారల్నీ, దూరానగాలికి అల్లల్లాడిపోతున్న చెట్లనీ మిణుగురు పురుగుల్లాంటి మెరుపుల్నీ వింతగా ఆశ్చర్యంగా ఆనందంగా చూస్తోంది.

ఆ పిల్లని ఐ.ఏ యస్. కుర్రాడికిచ్చి చెయ్యాలని ఇప్పట్నుంచీ ఆ తల్లిదండ్రుల ఆలోచన.

మూడోవాడు సత్యనారాయణ నెహ్రూ వరప్రసాద్. వాడికి ఆరేళ్ళు. బొద్దుగా ముద్దుగా వుంటాడు. తలుపు దగ్గర నిలబడి బయటికెళ్ళి కాగితపు పడవలతో ఆడుకుంటే బావుణ్నని చూస్తున్నాడు. వాడు తప్పకుండా నెహ్రూ అంత గొప్పనాయకుడవుతాడని ఆ దంపతుల నమ్మకం.

తెల్లబుల్లి సింహపు పిల్లలాంటి కుక్క 'జూలీ' వియ్యన్నగారి కాళ్ళ దగ్గర కూర్చునుంది.

తిరగేస్తోన్న వారపత్రికలోంచి దృష్టి మరల్చి "ఈ తుఫాను ఇప్పుడప్పుడే తగ్గేట్టులేదండీ. ఈ వాతావరణం చూస్తోంటే పిల్లలకి జలుబు చేసేట్టు కూడా వుంది. పోనీ టౌన్‌కి వెళ్ళిపోతే ?" అంది గాయత్రీదేవి.

ఆయన తలపంకించారుగాని ఏమీ అనలేదు.

భార్య అన్న మాటల గురించాయన ఆలోచించటంలేదు. ఈ వర్షాల వల్ల ఈనుతున్న వరిచేలు చాలావరకూ దెబ్బతింటున్నాయి. గనుక వాటి వల్ల వచ్చే నష్టాన్ని వడ్డీతో సహా ఎలా రాబట్టడమా అని ఆలోచిస్తున్నారాయన.

ఈ వర్షం వల్ల ఊరికీ ఊళ్ళోవారికీ చాలా నష్టాలు కలిగాయి. గనుక ఈ వర్షం పేరుతో ఏమైనా సంపాదించుకోడానికి వీలుంటుందేమో నని పథకాలు వేస్తున్నారాయన.

తిరగేస్తున్న వీక్లీ ఇదివరకు చదివిందే గనుక గాయత్రీదేవికి బోరు కొట్టింది. రేడియో పాటలు ఆసక్తిగా లేకపోవడంతో అటూ ఇటూ ఓ రెండు క్షణాలు అసహనంగా చూసింది. ఆమె దృష్టి ఫ్లాస్కు మీద పడటంతో వెళ్ళి ఫ్లాస్కూ అయిదు కప్పులూ తెచ్చి టీపాయ్ మీద పెడుతూ "ఒరేయ్ బాబూ-కేక్స్ గాని బిస్కెట్లు గాని తింటార్రా" అంది.

"వద్దు మమ్మీ" చివరి ఇద్దరూ జవాబిచ్చారు.

"పోనీ ఒకటి తీసుకోండి బాబూ" అంటూ బ్రతిమాలి తలొకటీ ఇచ్చింది భర్తతో సహా అందరికీ. తనూ ఒకటి తీసుకుంది.

నాలుక జాపుతూ 'జూలీ' వియన్నగారి కాళ్ళమీద కాళ్ళు పెట్టి ఆయన చేతుల్లోని కేక్‌వంక ఆశగా చూడసాగింది.

"నీ జూలీకి కూడా కావాల్టే" నవ్వారాయన.

"దానికి పెట్టకుంటా ఎలా లెండి. దొంగలు పడకుండా కాపాడు తోంది అదే కదా" అంటూ కుక్క బిస్కెట్ల పాకెట్లోంచి రెండు తీసి జూలీకి పెట్టింది.

అనంతరం ఫ్లాస్కులోని పాలు కప్పుల్లో పోసి తలొకటీ అందించింది.

"పాపం అంజిగాడికూడా ఏదో పెట్టరాదుటే నాల్రోజుల్నుంచి కుక్కలా పడున్నాడు మన గుమ్మం దగ్గర"

"ఇంకా నయం. వాడి పెళ్ళాం పిల్లలకూడా పంపమన్నారుకాదు అయినా కుక్కలా కాపలా కాస్తూ మనం చెప్పిన పని చెయ్యడానికే కదండి వాడ్ని పాలేరుగా పెట్టుకుంటా!" అంది గాయత్రీ దేవి.

"అయితే మాత్రం ఈ రోజుల్లో అంతలా స్వామి భక్తితో వుండే వాళ్ళెవరు చెప్పు ? మనం సీతారాముళ్ళం అయినా గాకపోయినా అంజి గాడు మాత్రం ఆంజనేయులే"

"చాల్లేద్దురూ. డబ్బు పారేస్తే వీడేమిటి వీడి బాబులాంటి వాళ్ళు వందలమంది వస్తారు అయినా ఎప్పుడూ లేందివాళ పాలేరుగాడి మీద ప్రేమ పుట్టుకొచ్చేసిందేమిటి మీకూ ?"

"అది ప్రేమ కాదే. ఇందాక కుక్కకి బిస్కెట్లు పెట్టావ్. దాని మీద ప్రేమ చేత పెట్టావా ? లేదు. దాని కడుపు నూడకుండా పెడుతుంటే బాగా కావలా కాస్తుందని. ఒకవేళ మనం పెట్టలేదనుకో రెండు మూడు సార్లు ఓపిగ్గా చూస్తుంది. నాలుగోసారి మన చేతిలోది లాక్కుంటుంది. మనం దొరక నివ్వకపోతే ఇంకో ఇల్లు చూసుకుంటుంది."

"మన జూలీ ఎప్పుడూ అలా చెయ్యదండీ" అభిమానంగా అంది.

నవ్వి అన్నారు "మనం అలా అనుకోవడంలో తప్పు లేదనుకో. కాని మన అంజిగాడి విషయమే తీసుకో. మూడ్రోజుల్నించో నాల్రోజు ల్నించో ఇంటి కెళ్ల నివ్వకుండా ఇక్కడే వుంచేశాం-ఎప్పుడే అవసరం వస్తుందోనని. వాడికి మన మీద భక్తి విశ్వాసాలున్నాయి గనుకే వున్నాడు. దాన్ని మనం కాపాడుకోవాలి మరి. అంటే వాళ్లకేదో దోచి పెట్టెయ్యమని కాదు. అప్పుడప్పుడూ ఓ మంచి మాటా ఓ మాంసం ముక్కా వేస్తే చాలు ఆజన్మాంతం మన కాళ్ల దగ్గర తోకాడించుకుంటూ పడి వుంటారు. ఎప్పుడో మాటెలా వున్నా వాడవసరం మనకిప్పుడెక్కువగా వుంది కూడానూ...."

"అంటే వాడ్నిప్పుడు కాకా పట్టమంటారా ?" రోషం చిందు లేసిందావిడ స్వరంలో.

"అది కాదే. నే చెప్పేది కాస్త విను మరి. వర్షం ఇలాగే వుంటే మనం పట్నం వెళ్ళాల్సొరావచ్చు. అప్పుడు మనం గూడు బండిలో

వెచ్చగా కూర్చుంటే వర్షంలో బండి తోలేది వాడే. అంచేత ఏ టీయో బిస్కెట్లో వడెయ్యడం మంచిదంటాను".

గాయత్రీదేవి మొఖం ఎర్రబడింది. ముక్కుపుటాలు కొంచెంగా అదురుతోంటే "ఇన్నాళ్లూ ఈ కమ్యూనిస్టు కబుర్లు బయటి వాళ్లకే అనుకున్నాను. ఇప్పుడు ఇంట్లో కూడా మొదలెట్టారన్నమాట!" అంది రోషంగా.

బొజ్జ అదిరేలా నవ్వేరాయన.

"మీకు నవ్వులాటగానే వుంటుంది....!"

"అది కాదే...."

"మీరింకేం చెప్పనక్కర్లేదు. కారు కొనండీ అంటే విన్నారా ? కారుంటే ఇప్పుడా పాలేరుగాడ్ని దేబిరించాల్సిన ఖర్మ పట్టేదా ?"

"కారుకైనా డ్రైవరు వుండాలిగా ?!"

ఆ మాటలకీ అప్పుడాయన నవ్విన నవ్వుకీ గాయత్రీదేవికి విపరీతంగా కోపం వచ్చింది.

"అవున్లెండి. మీ అలగా బుద్ధికి అలగా జనమే ఎక్కువగా కనిపిస్తారు. వాళ్లు లేకపోతే మనం బ్రతకలేమంటారు" అంటూ లేచి విసవిసా వెళ్లిపోయింది పడకగదిలోకి.

తన పుట్టింటి వారికన్నా అత్తింటివారు ఆర్థికంగా కాస్త దిగువ స్థాయిలో వున్నందున భర్త వంశాన్నీ వంశస్తుల్నీ చులకన చేసి మాట్లాడుతూంటుందామె కోపం వచ్చినప్పుడల్లా.

"అది కాదే...." అంటూ వియ్యన్నగారు ఆప ప్రయత్నించినా ఆమె ఆగలేదు. వుస్సురంటూ నిట్టూర్చి లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని వీధి తలుపులు తీసి బయటికి తొంగి చూశారు.

అరుగు మూలన అంజిగాడు అని పిలవబడే అంజయ్య ముడుచు కుని కూర్చుని చిరుగుల రుమాలతో చలినుంచి రక్షించుకోవాలని నానా యాతన పడుతున్నాడు.

వాడ్ని చూసి తృప్తిగా నిట్టూర్చి "వున్నావు కదా" అన్నారాయన. వాడు కప్పుకోడానికో పాత దుప్పటో చిరుగుల గుడ్డో ఇద్దామన్న ఆలో చన రాలేదాయనకి.

వాడు చేతులు కట్టుకుని తలూపుతూ దగ్గరికొచ్చాడు.

"ఓ పాలి మా గుడిసె కెళ్ళొత్తానండి. పిల్లలూ అమ్మా ఎట్టా వున్నారో ఏమో!" అన్నాడు కళ్లనిండా ఆశనింపుకుని.

వులిక్కిపడ్డారు వియ్యన్నగారు.

"పెద్దవు గాన్లేరా ఆపతలేవో కొంపలు మునిగిపోతున్నట్టు ఇదవు తావేం. నీతో పనుంది గనుకే వుండమన్నాను. నువ్వీ ఊరొచ్చినకొత్తలో ఎవ్వరూ నిన్ను పన్లో పెట్టుకోడానికి ముందుకి రాకపోతే నేను పెట్టు కున్నానని మర్చిపోకు."

వాడి మొఖంలోకోసారి చూసి తిరిగి తనే అన్నారు "చుట్ట కావాలా ? సిగ్గుపడకు"

స్వెట్టర్ క్రింద వున్న బనీను జేబులోంచో చుట్ట తీసిచ్చి "నీతో చాలా పనుంది. ఎక్కడికీ పెళ్లకొరేయ్" అని చెప్పి తలుపువేసి గదిలోకి నడిచారు.

మంచం మీద బోర్లా పడుకున్న భార్యని చూసి ఇంకా కోపం తగ్గ లేదనుకుని ఆ ప్రక్కనే కూర్చుంటూ, "ఒసే పిచ్చిదానా! మన లాంటి ధనికులకి మొదటి శత్రువు ఎవరో తెలుసా!" అని ప్రశ్నించారు.

ఎవరన్నట్టు చూసిందామె నుదురు చిట్లించి.

"మనకి ప్రభుత్వం వల్ల భయం లేదు. పోలీసుల వల్ల ముందే భయంలేదు. దొంగల వల్ల కూడా భయంలేదు. వాళ్ళు కన్నం వేసినా మనకి తరిగేది కొంచెం బ్లాక్ మనీయే గనుక. మరి మన శత్రువు లెవరంటావా అలగా జనమే. వాళ్ళు సాధారణంగా ఎదురు తిరగరు. మనం తిరగనివ్వం కూడా. తిరిగితే మన పని ఖాళీయే. అంచేత మనం జాగ్రత్తగా వుండాలి. మన పొలాల్ని పండించేది వాళ్ళే. మన మిల్లులోని యంత్రాలు తిప్పేది వాళ్ళే. మన జల్సాలకి ఏర్పాట్లు చేసేది వాళ్ళే. మనకి ఓట్లేసి పదవుల్లో కూర్చోబెట్టేది వాళ్ళే. అంచేత వాళ్ళని అలగా జనంగానే వుంచాలి. వాళ్ళకేదో ఆశ చూపుతూ అవసరమైతే బెదిరిస్తూ మన చెప్పు క్రింద వుండేట్లు చూసుకోవాలి. అప్పుడే మన మెక్కిన పల్లకీని వాళ్ళు మోస్తారు తెల్సిందా ? నాకీ ప్రాంతంలో ఎదురనేది లేకపోయిందీ అంటే ఈ పాలసీవల్లనే" అంటూ తన ఫిలాసఫీని వివరించారు వియ్యన్నగారు.

"అంటే ఆ కూలినాలి జనం లేకపోతే మనం సుఖంగా బ్రతక లేమంటారా ? అంతా వాళ్ళ గొప్పే అంటారా ?" తీక్షణంగా అందావిడ.

"పిచ్చిదానా! వాళ్ళ వల్ల మన పనులు నెరవేరుతున్నాయని వాళ్ళు మనకంటే గొప్పవాళ్ళంటానా ? వాళ్ళు లేకపోయినా మనం హాయిగా సుఖంగా బ్రతగ్గలం. డబ్బే అన్నీ అమర్చిపెడుతుంది మనకి. కాని మనం లేకపోతే వాళ్ళు మలమలా మాడి చస్తారు. అయినా వాళ్ళతో మనకి పని వున్నప్పుడు కొంచెం మంచిగా వుండటం మన ప్రెస్టేజికి నష్టం కాదంటు న్నాను. అంతెందుకు ఇంత క్రితం వాడు ఇంటి కెళ్ళొస్తానంటే కసిరి ఓ చుట్ట ఇచ్చేసరికి తోక ముడుచుకుని కూర్చున్నాడు. వాడు మళ్ళీ ఇంటికెళ్తా నంటాడేమో చూడు" అన్నారు విజయగర్వంతో.

అంతా విని భర్త తెలివితేటలకి మురిసిపోతూ "నిజమే సుమండీ, నేనంత దూరం ఆలోచించనే లేదు" అంది గాయత్రీదేవి.

"అందుకే అన్నారు ఆడవాళ్లకి నోటి దురద ఎక్కువ" అని ఖళ్లున నవ్వి "హాల్లో కూర్చుందాంరా. పిల్లలక్కడుండగా మనం గదిలో వుండటం బావోదు" అన్నారు.

ఇద్దరూ హాల్లో కొచ్చి కూర్చున్నారు ఇందాకటి స్థానాల్లోనే.

గాయత్రీదేవి కేదో గుర్తు కొచ్చి పరుపు క్రింద పెట్టిన డిటెక్టివ్ పుస్తకం తెచ్చుకుని డిటెక్టివ్ భగవాన్ వెంట పరుగెత్తసాగింది.

వియ్యన్నగారు చెవిని రేడియో కప్పగించి ఏవేవో పథకాలేస్తూ కూర్చున్నారు.

బయట వర్షం మాత్రం యథా ప్రకారం కురుస్తూనే వుంది.

తల్లీతండ్రీ తనని గమనించటం లేదని నిర్ధారణ చేసుకున్న నెహ్రూ వర ప్రసాద్ మెల్లగా తలుపు తీసుకుని వీథిలో కెళ్లాడు. తమ్ముడి గురించి తల్లికి ఫిర్యాదు చేద్దామనుకున్న ఇందిరా ప్రియదర్శిని వెంటనే తన అభిప్రాయాన్ని మార్చుకుని వీధి గుమ్మం దగ్గర నిలబడి బయటికి చూడసాగింది.

ఇందాక వియ్యన్నగారు చుట్ట ఇస్తే అంజయ్య కొంచెం సంబరంగానే అందుకున్నాడు. చుట్ట ఇచ్చినవారు అగ్గిపుల్ల కూడా ఇస్తారని చూశాడు గాని ఆయనదేం పట్టించుకోకుండా వెళ్ళిపోయారు లోపలికి. పిలిచి అడగగల ధైర్యం లేక అక్కడే చుట్ట పట్టుకుని నిలబడిపోయిన అతడికి ఆ అబ్బాయిని చూసేసరికి వుత్సాహం వచ్చింది.

"అబ్బాయిగోరూ ఓ అగ్గిపుల్ల తెత్తారా చుట్టెలిగించుకుంటా"

"ష్-మాట్లాడకు. డాడీ వింటే కోప్పడతారు బయటి కొస్తే జబ్బు చేస్తుందట. మమ్మీ వెళ్లొద్దంటోంది" అన్నాడా కుర్రాడు ముక్కు మీద వేలుంచుకుని మరీ. కాగితపు పడవల్ని నీటి ప్రవాహంలో వేసి వినోదించసాగాడు.

వుస్సురంటూ వెళ్లి యథాస్థానంలో ముడుచుకుని కూర్చున్నాడు అంజయ్య.

ఎన్నెన్నో ఆలోచనలు అతడి మస్తిష్కం చుట్టూ ఈగల్లా ముసిరాయ్. మరెన్నో భయాలు కూడా చుట్టు ముట్టాయ్.

"తన పూరి గుడిసెట్టా గుందో! కప్పుకూలి పోలేదు గందా ? తూర్పేపు గోడసలే అవుటిది. ఈ వోనకి తడిసి వడిపోలేదు గందా ? ఇంటిది పిల్లల్తో ఏం అవత్త పడుతోందో ఏవోఁ! గుంటదానికి తన దగ్గర మాలిమెక్కువ కూడాను. ఎట్టా గుందో! అన్నట్టు పెద్దానికి వోనంటే భయం గదూ? అద్సరే అసలింట్లో కూడొంటానికి నూకలున్నాయో లేవోఁ! మూడ్రోజుల కన్నా ఎక్కువరావని ఇంటిద సెప్ప ఆర్రోజులవ్వనేదూ? ఈ గాలోన్లో ఎట్టా అవత్త పడుతన్నారో ఆ భగమంతుడికే తెలవాల....!"

అతడి కళ్లు చెమ్మగిల్లాయ్. మనసంతా ఆందోళనతో నిండిపోయింది తిన్నగా స్థిమితంగా కూర్చోలేక అటూ ఇటూ పచార్లు చెయ్యసాగాడు.

"ఎంత పాలేరోడైతే మాత్రం ఇంటి కుక్కాదుగా కాళ్ల కాడపడుంటానికి. తనకీ పిల్లా జెల్లా వున్నారనీ ఆళ్లని సూసుకోవాలనీ ఆయనికి తెల్దాని ? మున్నాల్రోజుల్నుంచి ఇక్కడే కట్టి పారేసారు గాని ఓసారి ఎల్లొత్తానంటే వల్లకాదంటున్నారు. ఆరితో ఎట్టుకుంటే ఇంతేగాని సెప్పాసెయ్యకుండా ఓపాలి గుడిసెకెళ్ళొత్తే ?"

అదే మంచిదన్పించింది. ఏమైనా సరే వెళ్లాలనే అనుకున్నాడు. కాని ఆ భావం ఎంతోసేపు నిలవలేదు.

"ఇన్నాళ్ళూ మంచోడన్పించుకుని ఇయ్యాలిలా సేత్తే ఏవఁను కుంటారు? నిన్నట్నించా మొన్నట్నించా ఆరేళ్లనుంచి సేస్తన్నాడు ఈరి దగ్గర. పైగా ఆరేళ్ళక్రితం తూర్పునించి పొట్ట చేత బట్టుకుని ఈవూరొచ్చినప్పుడు ఎవరూ నమ్మి పాలేరుగా ఎట్టుకోకపోతే ఈరే ఎట్టుకున్నారు

పదేనుబత్తాలకి. తర్వాత్తెలిసింది పూర్కో పాలేరుకి ఇరవై బత్తాలిత్తున్నారని. అయితే మాత్రం ఆ సాయం సిన్నదా సిటికెదా. అప్పుడాయ నెట్టుకోపోతే మలమలా మాడిపోయేవోరుకాదూ ? అంతే మరి. అంతగా గుడిసె కూలిపోతే ఏ చూరుకిందో తలదాచుకుంటార్లే. కాని.... అక్కడున్నవన్నీ గుడిసెలేనే...."

ద్వైధీభావంతో నలిగిపోతున్నాడు అంజయ్య.

ఇంతలో దూరాన పిడుగు పడింది. అంజయ్య ఒళ్ళు భయంతో కంపించింది.

వియ్యన్నగారి చిరంజీవి తను వేసిన కాగితపు పడవలు బోల్తాపడి వేగంగా కొట్టుకుపోతూండటం చూసి కేరింతలు కొడుతున్నాడు.

పిడుగు శబ్దానికి డిటెక్టివ్ పుస్తకంలోంచి బయటపడి పిల్లల కోసం చుట్టూ చూసింది గాయత్రీదేవి. చిన్నబాబు కన్పించలేదు. అదుర్దాగా "ఇందూ-చినబాబు ఏడమ్మా" అనడిగింది.

"బయట ఆడుకుంటున్నాడు మమ్మీ" ఇందిర జవాబిచ్చింది.

"బయటికెందు కెళ్ళాడు" అంటూ వీధిలో కొచ్చి, "అయ్యో తడుస్తావయ్యా" అని చినబాబుని లోపలికి తీసుకెళ్ళింది.

వెళ్ళేముందు "అలా ముంగిలా కూర్చుని చూడకపోతే బాబు తడుస్తాడు లోపలికెళ్లమని చెప్పొద్దూ. బొత్తిగా విశ్వాసంలేని జాతి!" అని అంజయ్యని ఈసడించింది.

సరిగ్గా అప్పుడు అంతవరకూ ఏవో పాటలు విన్పించిన రేడియో "ఒక ముఖ్య ప్రకటన...." అంది.

ఆలోచనా సమాధిలో వున్న వియ్యన్నగారూ గాయత్రీదేవీ కూడా పులిక్కిపడి ముఖాముఖాలు చూసుకుని రేడియో వైపు తిరిగారు.

"నాలుగు రోజుల్నుంచి కుంభవృష్టిగా కురుస్తోన్న వర్షం వల్ల గోదావరి మట్టం విపరీతంగా పెరిగిపోతోంది. ఇప్పుడప్పుడే గాలివాన

తగ్గే సూచనలు కూడా కన్పించడంలేదు. అందువల్ల గోదావరి తీర గ్రామ వాసుల్ని ముఖ్యంగా లోతట్టు గ్రామాల ప్రజలు ఆయా గ్రామాలు వదలి వెంటనే సురక్షిత ప్రాంతాలకి తరలివెళ్ళాల్సిందిగా జిల్లా కలెక్టరు విజ్ఞప్తి చేస్తున్నారు. వాతావరణం ఇలానే వుంటే అయిదారుగంటల్లో గోదావరి పొంగి పల్లపు ప్రాంతాల్ని ముంచెయ్యొచ్చని పరిశీలకులు తెలియజేస్తున్నారు...."

ఆ వార్త విని అదిరిపోయారు వియ్యన్నగారు. ఆయన భార్య విపరీతంగా భయపడిపోయింది. ఆమె మొఖం తెల్లగా పాలిపోయిందొక్కసారే. తనకెంతో ఇష్టమైన డిటెక్టివ్ పుస్తకాళ్ళన్నో పక్కకు విసిరేసి పిల్లల్ని పిలిచి వాళ్ళని సందిట్లోకి తీసుకుంటూ, అయితే త్వరగా టౌన్‌కి వెళ్ళిపోదామండీ. రేడియో వాళ్ళని ఎవరు నమ్మమన్నారు. నాలుగ్గంటల్లో వస్తుందన్న ముంపు రెండుగంటల్లోనే రావచ్చు. అంది కంపిత స్వరంతో.

ఆయన కూడా కంగారుపడుతూ లేచి "అలాగేనే. ముందు ముఖ్యమైన సామానదీ సర్దు. క్రింది గదుల్లోని సామానుని మేడమీది గదుల్లో పెట్టించేద్దాం" అన్నారు.

"ముంపు గురించి తెలిస్తే అంజిగాడు ఇంటికి పారిపోతాడేమోనండీ"

"పారిపోతాడా ? పారిపోవడానికెన్ని గుండెలంట వాడికి ? తాట వొలిచెయ్యనూ పెధవని !" రెచ్చిపోతూ అన్నారు.

"అది కాదండీ-అవసరం మనది గనుక మంచిగా వుండి పనులు చేయించుకోవాలన్నారుగా"

"అంత కోపంలోనూ నవ్వేరు "నా ఫిలాసఫీ బాగానే వంటబట్టిందన్న మాట. అందుకే ఓ ప్లాన్ సిద్ధం చేశా. ఓ పాతిక రూపాయలు ఆశ చూపితే చాలు మనం వెళ్ళమన్నా వెళ్లడు"

అంజయ్యని పిలిచి గబగబా విలువైన సామానుని మేడమీది గదు

ల్లోకి జేరవేయించారు. డబ్బూ బంగారం ఇతర ముఖ్య సామాగ్రీ కొన్ని బట్టలూ సూట్ కేసుల్లోకి సర్దేళాయి భార్యసాయంతో వియ్యన్నగారు.

అన్నీ సర్దుకున్నాక అన్ని గదులకీ తాళాలు వేయించి రెండెడ్ల బండి కట్టించారు. టార్పాలిన్ తో గూడు కట్టించారు.

"ఒరే అంబిగా! పరుగున మా తమ్ముడింటికీ మునసబుగారింటికీ వెళ్ళి మేం పట్నం వెళ్ళిపోతున్నామనీ వాళ్లనీ వచ్చెయ్యమనీ చెప్పు. గోదావరి పొంగుతోందనీ మనూరిని ముంచెయ్యొచ్చని రేడియోలో చెప్పే రని చెప్పు"

"అయ్యాబాబో! మనూరు మునిగిపోద్దాండి. అరికి సెప్పి అలా మా గుడిసె కెళ్ళి మా ఇంటిదానికి సెప్పొత్తానయ్యగోరూ"

"నోర్మయ్యరా దొంగనాయాలా. మేం త్వరగా పోవాలా అంటే వీడు ఇంటి కెళ్లొస్తాట్ట !"

"అది కాదయ్యగోరూ. మా గుడిసె— మా పిల్లలు—"

"నోర్మయ్యమంటే నీకాదుట్రా లంజాకొడకా. అణాకాని గుడిసె కోసం మమ్మల్ని ముంపులో నిలువునా ముంచేద్దామనుకుంటున్నావుట్రా. నీ గుడిసె నీ పెళ్లాం ఏం అవ్వరుగాని మమ్మల్ని పట్నంలో దిగబెట్టి వచ్చేద్దువు గాన్లే. బండి కూడా ఇస్తాన్లేగాని ముందెళ్ళి మా తమ్ముడితోనూ వాళ్లతోనూ చెప్పిరా. అట్నుంచటు మీ ఇంటికెళ్ళావో మక్కెలిరగదన్నటవే కాదు పెట్రోలు పోసి నిలువునా కాల్చి పారేస్తాను. జాగ్రత్త-పో వెధవా" గర్జించారాయన.

నోరు మూసుకుని కామందుగారి హుకుంని అమలు పరచడానికి వర్షంలో కెళ్లబోతున్నవాడల్లా మునసబుగారి పాలేరు పరుగున వస్తూం డటంతో ఆగిపోయాడు.

"పెసిరెంటుగోరూ-మనూరికి వరదొొత్తాదంటండి. రేడియో సెప్పిం

దంట. మా కాపుగారు పట్నం ఎళ్ళిపోతన్నారు. తమరికి సెప్పమన్నారు" అన్నాడు ఒగురుస్తూ.

"మేమూ బయల్దేరుతున్నాంగాని మా తమ్ముడికి చెప్పేవా ?"

"అయ్-వత్తానండి" అంటూ పరుగిచ్చుకున్నాడు వాడు.

"ఇంకా అలా రాతిబొమ్మలా నీకబడ్డావేంరా బండి కట్టి తీసుకురా" అని హుంకరించి మళ్లీ ఏమనుకున్నారో ఏమో అనునయ ధోరణిలో అన్నారు" ముంపు ఇవాళొస్తుందని రేడియోలో చెప్పలేదురా. రేపో ఎల్లుండో వస్తే రావొచ్చన్నారు. మేం పూరికే భయపడి వెళ్తున్నాంగాని నిజానికి కంగారు పడాల్సిన పరిస్థితేం కాదు. పట్నం వెళ్ళేక నీకో పాతిక రూపాయలిస్తాలే. ఈ రాత్రి పట్నంలో జల్సా చేద్దువుగాని. రేపొచ్చి నీ పెళ్లాం పిల్లల్ని తీసుకెళ్దువు గాని-బండి ఇస్తానన్నాగా"

చేపకి ఎరవేసినట్టుగా అని తనలోనే నవ్వుకున్నారు.

కదలక తప్పలేదు అంజయ్యకి.

వియ్యన్నగారు భార్యాపిల్లల్తో సూట్‌కేసుల్తో బండెక్కారు. వారి ప్రియమైన జూలీని కూడా ఎక్కించుకుంటే కొంచెం ఇరుకవ్వొచ్చనిపించింది.

"జూలీ బండెనక వస్తుంది లెద్దూ హ" అనేసి వెనుక టార్పాలిన్ కప్పేసింది జల్లు కొట్టకుండా గాయత్రీదేవి.

బండి కదిలింది.

వర్షంలో తడుస్తూ మొరుగుతూనే బండి ఎక్కించుకుంటారని కాసేపు బండి చుట్టూ తిరిగి తిరిగి నిరాశ చెంది పరుగున మళ్లీ మేడ దగ్గరికెళ్లి అరుగు ఎక్కి గట్టిగా మొరగసాగింది జూలీ!

ఆ కుక్క చేసిన పని చూసిన అంజయ్య "దాని కన్నా తీసికట్టయి పోయింది నా బతుకు" అనుకున్నాడు.

8)

హోరున కురుస్తోన్న వర్షంలో పెనుగాలిలో మోకాళ్లలోతు మట్టిలో ముందు కదుగెయ్యడానికి ఎద్దులు మొరాయిస్తోంటే వర్షంలో తడుస్తూ అతి కష్టం మీద తోలుతున్నాడు అంజయ్య.

"త్వరగా తోల్రా" కసిరారు వియ్యన్నగారు.

ఎద్దులాగిపోయాయ్. తోక మెలిపెట్టాడు. కవుసీకర్రతో బాదేదు. వూహం - కదల్లేదవి.

"బండి దిగి తోల్రా" వురిమారాయన.

బండి దిగి ఎద్దుల డొక్కల్లో కర్రతో పొడిచాడు. బండి కదిలింది. బండితో బాటు నడుస్తూ ఎద్దుల డొక్కల్లో పొడుస్తూ తోలుతున్నాడు అంజయ్య. భార్యా బిడ్డల్ని తలచి ఓ చెంప కన్నీరు కారుస్తూనే వున్నాడు.

"చూశావుటోయ్. వాడు పారిపోతాడేమో అన్నావుగా" గర్వంగా అన్నారు వియ్యన్నగారు నెమ్మదిగా భార్యతో.

"అవును సుమండీ. నేనేదో అనుకునేదాన్ని కానీ సమయానికి ఈ పాలేరుగాడు లేకపోతే చచ్చేంత యాతనవును కదండీ"

"వాడు లేకపోవడమన్న ప్రశ్నే లేదసలు. వాడు మన దబ్బుకి మనం ఏదో చేసేస్తామన్న భయానికీ లొంగక తప్పదు. మనల్ని కాదంటే రేపు వాడ్ని వూళ్ళో వుండనిస్తామా చెప్పు? అందుకే వాళ్లు మనకి లొంగి వుంటా రెప్పుడూ మనం మంచి వాళ్ళలా వుంటూ మధ్య మధ్య అవసర మైనప్పుడు హెచ్చరిస్తుంటే చాలు మన పనులన్నీ నిర్విఘ్నంగా జరిగి పోతాయ్."

గోదావరి గట్టు దగ్గరి కొచ్చింది బండి.

గోదావరి శివమెత్తినట్లు పరవళ్ళు త్రొక్కుతూ ప్రవహిస్తోంది. ఉగ్ర గోదావరిని చూసేసరికి అంజయ్య గుండెలు జారిపోయాయ్. అతడెన్నడూ ఇంత భయంకరంగా మహోగ్రంగా వున్న గోదా

వరిని చూడలేదు. ఇంకొంచెం సేపిలాగే వుంటే గోదావరి పొంగి గట్టుని దాటి వూరిని ముంచెయ్యెచ్చన్పించింది.

పిచ్చిగా కురుస్తోన్న వర్షాన్నీ అంతకంతకీ వూగిపోతున్న గోదార్నీ చూస్తూ బొమ్మలా నిలబడి పోయాడు.

బండి ఆగిందేవిటాని చూసిన వియ్యన్నగారికి గోదావరిని గుడ్లప్ప గించి చూస్తోన్న అంజయ్య కన్పించాడు. వులిక్కి పడ్డారు.

"పాతిక్కాదు యాభై రూపాయ లిస్తాను గానీ త్వరగా పోనీరా".

ఆ మాటలు వినబడనట్లే వుండిపోయాడు.

"విన్నేరా దొంగపీనుగా. బండి తోలకపోతే కాల్చి పారేస్తాను. ఏమే-బేగ్‌లోంచి నా పిస్తోలు తీసియ్యి...."

ఆ మాట లతడికి విన్పించడం లేదు.

కళ్ళ ముందు వుప్పొంగుతున్న గోదావరీ అది పొంగితే వరద కాహుతయ్యే వూళ్ళోని జనమూ కదుల్తున్నారు. చెవుల్లో వారి హాహాకారాలు మార్మోగుతున్నాయి.

అంతే.

"వరదొస్తోందొహోయ్" అంటూ గట్టిగా అరుచుకుంటూ వూళ్ళోకి పరుగెట్టాడు అంజయ్య—వియ్యన్నగారి తిట్లనీ బెదిరింపుల్నీ లెక్క చెయ్య కుండా.

వియ్యన్నగారి బండి బోయీలు లేని పల్లకీలా ఒంటరిగా నిలిచి పోయింది గోదావరి ఒడ్డున కుండపోతగా కురుస్తోన్న వర్షంలో!

—o—

('యువ'-జూన్'80)